క్లుప్తంగా

ఇంటి పన్ను వసూళ్లపై సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ధర్మపురి: ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో ఇంటి పన్నుల వసూళ్లపై ఆదివారం రివ్యూ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇంటి పన్నుల వసూళ్లపై అడిగి తెలుసుకున్నారు. ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, వార్డు ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు మహిళా దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న మహిళలు

జగిత్యాలటౌన్: పద్మనాయక వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పద్మనాయక కల్యాణ మంటపంలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్య,ఉద్యోగాలతో పాటు ఇంటి పనుల్లో నిత్యం బిజీగా ఉంటే మహిళలు ఆటాపాటలతో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన మహిళలు, బాలికలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న మల్లేశ్ యాదవ్

రాయికల్: యాదవుల సంక్షేమం కోసం వెంటనే ప్రభుత్వం యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని యాదవ అడ్‌హక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గన్నవేని మల్లేశ్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని అల్లీపూర్‌లో యాదవ సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించగా, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి వెంటనే యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, యాదవుల ఐక్యతతోనే అన్ని రంగాల్లో రాణించవచ్చని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రెబ్బాస్ మల్లయ్య, రాజలింగం, నాయకులు రాజం, గంగరాజం, రవి, మల్లేశ్, ఈరవేని మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ధర్మపురి: మండలంలోని కమలాపూర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నేత్రాలయ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో డాక్టర్ గడ్డం మృదులరెడ్డి కంటికి సంబంధించిన వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న 200 మందికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజర్ రెంటం సాయితేజ, శంకర్, ఒడ్డేటి నరేశ్ పాల్గొన్నారు.

కథలాపూర్‌లో వైద్య శిబిరం..


వైద్య శిబిరంలో బీఎస్‌రావు,నాయకులు

కథలాపూర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బీఎస్‌రావు ఫౌండేషన్, అపోల్ రీచ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్పందన లభించింది. ఈ వైద్యశిబిరంలో గుండె వైద్య నిపుణులు, నరాల వైద్యులు, కిడ్నీ వైద్య నిపుణులు ప్రజలకు వైద్య సేవలందించారు. శిబిరంలో 300 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు బీఎస్ రావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

ధర్మపురి: ధర్మపురిలోని గోదావరి తీరంలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఆదివారం స్వామివార్ల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ మండపంలో వేడుకలను కనుల పండువగా జరిపించారు. విశ్వ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో బుగ్గారం మాజీ జెడ్పీటీసీ బాదినేని రాజేందర్, ఎస్ దినేశ్, విశ్వబ్రాహ్మణుల సంఘం మండల అధ్యక్షుడు జ్ఞానాచారి, ప్రధాన కార్యదర్శి చిటన్నోజు శంకర్, పట్టణ వడ్రంగి సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీమహాలక్ష్మీ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

మల్యాల: మండలంలోని నూకపల్లి గ్రామ శివారులో నూతనంగా నిర్మాణం చేపట్టిన శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, హోమం, అభిషేకం నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సోమవారం ఆలయం ఆవరణలో భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



ఘనంగా మల్లికార్జునస్వామి జాతర

కథలాపూర్:మండలం చింతకుంట గ్రామంలో శ్రీ మల్లికార్జునస్వామి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మల్లిఖార్జునస్వామికి భక్తులు బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఆలయకమిటీ ప్రతినిధులు స్వాగతం పలికి సన్మానించారు.

అడవులకు రక్షణ కరువు

- కూరుకుపోతున్న కందకాలు
- జిల్లాలో 55 వేల హెక్టార్ల అటవీ విస్తీర్ణం
- రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు


తుమ్మెనాల వద్ద కనిపించని కందకాలు

ధర్మపురి: పర్యావరణ పరిరక్షణకు.. భూసారం కొట్టుకుపోకుండా ఉండేందుకు ప్రభుత్వం అడవులను పెంచుతోంది. అయితే వాటి రక్షణ కోసం ఏర్పాటు చేసిన కందకాలు ఎక్కడికక్కడ మూసుకుపోవడంతో నీరు అందక ఎండిపోతున్నాయి. పక్షులు, జంతువులు, వన్యప్రాణులు వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్నాయి. స్మగ్లర్లు బరితెగించి చెట్లను నరికి వేస్తున్నారు. ఏళ్ల తరబడి అడవుల చుట్టూ ఉన్న కందకాలు భారీ వర్షాలు, వరదలతో మూసుకుపోయాయి. ఫలితంగా చిన్న పాటి అగ్గి పడినా అవి రాజుకుని అడవికి మొత్తం అంటుకుని చెట్లు మొత్తం కాలిపోతున్నాయి.

జిల్లాలో అడవి విస్తీర్ణం

జిల్లాలో 55వేల హెక్టార్ల అటవీ విస్తీర్ణముంది. దీని కోసం ఐదు రేంజ్‌లను ఏర్పాటు చేసి అడవులను కాపాడుతున్నారు. జగిత్యాల, ధర్మపురి, మెట్‌పెల్లి, రాయికల్, కొడిమ్యాల రేంజ్‌లుండగా వాటిలో 26 సెక్షన్లు, 76 బీట్లుగా విభజించారు. వీటిలో ధర్మపురి, రాయికల్, సారంగపూర్, బీర్‌పూర్ తదితర మండలాల్లో దట్టమైన అడవులున్నాయి. హరిత హారం కింద అడవుల్లో అధికారులు వివిధ రకాలైన విలువైన మొక్కలను నాటారు. టేకు, నీలగిరి, వేప, మద్ది, పండ్ల మొక్కలైన మామిడి, అల్లనేరెడు, సీతాఫలం, ఔషధ మొక్కలు నాటి పెంచుతున్నారు. ఏపుగా పెరిగిన ఈ అడవుల్లో అడవి జంతువులు, పందులు, లేళ్లు, హైనాలు, కుందేళ్లు, మనుబోతులు, జింకలు, రకరకాలైన పక్షులు ఆవాసముంటున్నాయి. కందకాలు మూసుకుపోవడంతో చెట్లు స్మగ్లర్ల వేటుకు గురవుతున్నాయి. ధర్మపురి నుంచి జగిత్యాల వెళ్లే జాతీయ రహదారి పక్కన తుమ్మెనాల వద్ద సుమారు 50 ఎకరాల్లో నీలగిరి చెట్లను సాగు చేస్తున్నారు. వేసవిలో చెట్ల ఆకులు రాలి మంటలు ఏర్పడే ఆస్కారముంది. అడవులకు వచ్చే పశువుల కాపర్లు, స్మగ్లర్లు కాల్చిన బీడీ, సిగరెట్లతో మంటలంటుకుని దట్టమైన అడవులు దగ్ధమైన సంఘటనలున్నాయి. అదే కందకాలు ఉంటే మంటలు అదుపులోకి వచ్చే అవకాశం ఉంటుంది. పైగా మనుషులు లోనికి ప్రవేశించడంతో అనేక ప్రమాదాలకు గురి కావాల్సి వస్తోంది. ధర్మపురి మండలంలోని తుమ్మెనాల, వెల్గొండ, చిన్నాపూర్, బీర్‌పూర్, సారంగపూర్ మండలాల్లోని రేచపెల్లి ప్రాంతాల్లో కందకాలు మూసుకుపోవడంతో అడవులకు రక్షణ లేకుండా పోతుందని అంటున్నారు. ఇప్పటికైనా మూసుకుపోయిన కందకాలు మళ్లీ తవ్వించాలని స్థానికులు కోరుతున్నారు.

రక్షణ చర్యలు చేపడుతున్నాం



అడవుల రక్షణకు కందకాలు తవ్వించాం. కొన్నిచోట్ల మూసుకుపోయాయి. తిరిగి తవ్వించడానికి నిధుల రాక కొంత ఆలస్యమవుతోంది. అడవుల రక్షణకు చర్యలు తీసుకుంటున్నం. అడవుల్లోని కలప, జంతువుల రక్షణ కోసం వాచర్లను నియమించాం. ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నం.

– రవి ప్రసాద్, డీఎఫ్‌వో

శ్రీలక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రాయికల్: మండలంలోని భూపతిపూర్‌లో లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పుణ్యాహవచనం, రక్షబంధనం, అఖండ దీపారాధనవంటి పూజా కార్యక్రమాలు అర్చకులు వెంకటకృష్ణ, రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు దుబ్బరాజన్న ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకం

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంలో సోమవారం ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే మొదటి సోమవారం ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఆలయాన్ని శుద్ధిచేసిన అనంతరం ఈ పూజను పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఉదయం 11 గంటలకు హుండీ లెక్కింపు జరుగుతుందని ఆలయ ఈవో వద్లూరి అనూష, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య తెలిపారు.

తాట్లవాయిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం

రాయికల్:మండలంలోని తాట్లవాయిలో సీతారామ ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గ్రామంలోని అర్చకులు రంగాచార్యులు, శ్యామ్‌సుందరాచర్యులు, మురళీ, మదన్‌మోహన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ మహోత్సవం కనుల పండువగా నిర్వహించగా, భక్తులకు అన్నదానం చేశారు.

కట్కాపూర్‌లో మల్లన్న స్వామికి బోనాలు

రాయికల్: మండలంలోని కట్కాపూర్ గ్రామ శివారులోని మల్లిఖార్జునస్వామి గొల్ల కేతమ్మ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆదివారం లగ్గపట్నాలు, బోనాలు నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బద్ది పోచమ్మకు బోనాలు



కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్‌లో ఆదివారం బద్ది పోచమ్మకు ఘనంగా బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బద్ది పోచమ్మ అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాయకులు గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, సురేష్ గౌడ్, ముక్కెర లింబాద్రి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

విమానాశ్రయం ఏర్పాటుపై సంబరాలు


దుబాయ్‌లో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ ఎన్‌ఆర్‌ఐ సెల్ నాయకులు

రాయికల్/మల్లాపూర్: వరంగల్ పట్టణ శివారులోని మమ్మునూరులో విమానాశ్రయం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెల్పడంపై ఆదివారం దుబాయ్‌లోని బీజేపీ ఎన్‌ఆర్‌ఐ సెల్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఎయిర్‌పోర్టుతో వరంగల్ అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రానికి రెండో ఎయిర్‌పోర్టును మంజూరు చేసిన ప్రధాని మోదీ, కేంద్ర విమానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, సహకరించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నవనీత్ గాజా, శరత్‌గౌడ్, అపర్ణ, పెనుకుల అశోక్, అజయ్, విష్ణు, వినోద్, మదన్, శ్రీకాంత్, శేఖర్, నాగరాజు, కుమార్, మల్లేశ్, ప్రభాకర్, రాజు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాలటౌన్: పట్టణంలోని 9వ వార్డు వినాయకనగర్‌లో రోడ్డు ఆక్రమణలు జరుగుతున్నాయి. ఓ ఇంటి యజమాని సెట్‌బ్యాక్ లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టాడు. డ్రైయినేజీ సైతం ఆక్రమించి స్లాబు వేశాడు. మరికొంత మంది రోడ్డుపైనే మట్టి పోసి రోజుకింత రోడ్డును ఆక్రమించుకుంటున్నారు. దీనిని బల్దియా అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు అరికట్టాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: చిరంజీవి
మున్సిపల్ కమిషనర్, జగిత్యాల, సెల్ నంబర్: 9849905877

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మెట్‌పల్లిరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.మల్లాపూర్ మండలం సాతారం వైపు నుంచి ఓ ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా వేంపేట వద్ద పట్టుకున్నట్లు తెలిపారు.ట్రాక్టర్ యాజమాని రోహిత్,డ్రైవర్ రాంబాబులపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

4న నాగాలయ హుండీ లెక్కింపు

రాయికల్: మండలంలోని కొత్తపేట రాజరాజేశ్వర నాగాలయ హుండీని ఈనెల 4న మంగళవారం ఉదయం 10 గంటలకు లెక్కించనున్నట్లు ఈవో విక్రమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పుస్తెమెట్టెలు అందజేత

రాయికల్: మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన మూడపల్లి గంగు–లచ్చన్న కూతురు సంధ్య వివాహం ఆదివారం జరుగగా, కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తెమెట్టెలు అందజేశారు.కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేశ్, అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

పాఠశాల డైరెక్టర్లకు జాతీయ అవార్డు

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రానికి చెందిన బచ్‌పన్ ప్లేస్కూల్, అకడమిక్ హైట్స్‌కు చెందిన పాఠశాల డైరెక్టర్లు గడ్డం రాణి, వెల్మ సమత ఆదివారం న్యూఢిల్లీలో జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నారు. ఇన్నోవేటివ్ లెర్నింగ్ స్పేస్ విభాగంతో పాటు స్టెల్లార్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ విభాగంలో అవార్డులు రాగా, ఈ అవార్డులను ప్రముఖ బ్యాడ్మింటన్ నేషనల్ ప్లేయర్ సైనా నెహ్వాల్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వీరిని వివిధ పాఠశాలల యజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

మున్నూరు కాపు సంఘ నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

కోరుట్ల: పట్టణంలోని శ్రీ సిద్ధి వినాయక మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా అన్నం యాదగిరి, ఉపాధ్యక్షులుగా టీకుల నరేష్, చింతామణి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా తక్కురి భాస్కర్, కోశాధికారిగా దావేరి పురుషోత్తం, సహాయ కార్యదర్శిగా కుంకలగుంట ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు సన్మానించారు.

మాజీ స్పీకర్‌కు ఘన నివాళి


ధర్మపురిలో నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక నంది కూడలి వద్ద ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆయన చిత్ర పటానికి పూలమాలలేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం బడుగు బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో నాయకులు ఎస్ దినేశ్, వేముల రాజు, చీపిరిశెట్టి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు మండల కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శ్రీపాదరావు చిత్ర పటానికి నివాళి అర్పించి మౌనం పాటించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతులు స్వయం ఉపాధి పొందాలి


జాబ్‌మేళాలో ఎంపికైన యువతులు

రాయికల్: గ్రామీణ యువతులు ఉపాధి అవకాశాలను ఎంచుకోవాలని డాక్టర్ తురగ రాజిరెడ్డి అన్నారు. ఆదివారం రాయికల్‌లో హైదరాబాద్ ఎంఎన్‌సీ కంపెనీ, వసంత టూల్ కంపెనీల ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు మెగా జాబ్‌మేళా నిర్వహించారు. సుమారు 50 మంది మహిళలు పాల్గొనగా ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేసిన యువతులకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మండ్లు, కంపెనీ ప్రతినిధులు, నిర్వాహకులు తుమ్మల సదాశివరెడ్డి, కరస్పాండెంట్ బాలె శేఖర్, గంధ్ర అచ్యుత్‌రావు, వీరబత్తిని శంకర్, రామకృష్ణ, నిఖిల్ పాల్గొన్నారు.